
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 కర్నూలు
జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024


ఈనాడు కార్యాలయంపై రాళ్లు రువ్వుతున్న వైసీపీ కాటసాని అనుచరులు



చెలరేగిన వైసీపీ మూకలు

- ఈనాడు కార్యాలయంపై దాడి
- రాళ్లు, కర్రలతో దూసుకొచ్చిన వైసీపీ శ్రేణులు
- ఈనాడు ప్రతులకు నిప్పు పెట్టి నినాదాలు చేసిన వైనం
- మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ మూకల దాడి

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాలకుల అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం పత్రికలు, పాత్రికేయుల కనీస ధర్మం. అందులో నిజం లేకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చు. ఇందుకు విరుద్ధంగా వ్యతిరేక కథనాలు రాస్తున్నారనే అక్కసుతో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ మూకలు దాడికి తెగబడుతున్నాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ పాల్గొన్న సిద్ధం సభలో ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు మూకుమ్మడిగా దాడికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఆ ఘటనను మరువకముందే కర్నూలు జిల్లాలో వైసీపీ శ్రేణులు, ఆ పార్టీ మూకలు దాడులకు తెగబడ్డాయి. వ్యతిరేక కథనాలు రాశారనే అక్కసుతో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై దాడులకు దిగి బీభత్సం సృష్టించారు. హౌసింగ్ బిల్లుల చెల్లింపులో అక్రమ వసూళ్లపై వార్త రాశారంటూ మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌పై వైసీపీ మూకలు దాడికి దిగి చేతులతో కొట్టి, చొక్కాలు చింపేశారు. ఇది ప్రజాస్వామ్యమా...? రాజారెడ్డి రాజ్యమా..? అంటూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

- ఈనాడు ఆఫీసుపై దాడి.. బీభత్సం

కర్నూలు నగరం నడిబొడ్డున రాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న ఈనాడు లోకల్ ఆఫీసుపై మంగళవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడి దాడికి దిగారు. బీభత్సం సృష్టించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా వార్తలు రాస్తారా..? మీ అంతు చూస్తామంటూ ఆయన ముఖ్య అనుచరులు, నగర పాలక సంస్థ కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, షైతాపీ నరసింహులు, వైసీపీ యువజన విభాగం నాయకుడు అక్కిమి హనుమంతరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వందలాది మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఈనాడు ఆఫీసుపై దాడికి దిగారు. పెద్ద ఎత్తున కేకలు వేస్తూ కర్రలు, రాళ్లతో స్వైరవిహారం చేశారు. అద్దాలు పగులకొట్టారు. తలుపులు ధ్వంసం చేసి ఆఫీసులో ఉన్న ఈనాడు ప్రతులను రోడ్డుపైకి తీసుకువచ్చి నిప్పు పెట్టి రాక్షసానందం పొందారు. దాదాపు గంటన్నరకు పైగా నిత్యం రద్దీ ఉండే రాజ్‌థియేటర్ సర్కిల్‌లో బీభత్సం సృష్టించారు. సీఐలు ఇంతియాజ్ బాషా, శంకరయ్య, పవన్ కుమార్, రామయ్య నాయుడుతో పాటు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని వారిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినా ఏమాత్రం భయపడకుండా వైసీపీ మూకలు ఈనాడు కార్యాలయంపైకి వెళ్లి తలుపులు బద్దలు కొట్టారు. రాళ్లు రువ్వి అద్దాలు ధ్వంసం చేశారు. వైసీపీ నాయకుల చేష్టలతో వ్యాపారులు భయంతో దుకాణాలు మూసుకుని పారిపోవాల్సి వచ్చింది. ఈ ఘటనపై సీఐ ఇంతియాజ్ బాషాను వివరణ కోరగా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసీపీ దాడికి గురైన ఈనాడు కార్యాలయాన్ని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పరిశీలించారు. ఆయన వెంట ఐజేయు జాతీయ సమితి సభ్యుడు జి.కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసులు గౌడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకన్న, కోశాధికారి అంజి, నాయకులు శివ, అవినాశ్, స్నేహాల్, ఉసేని, తదితరులు ఉన్నారు.


వైసీపీ జెండాలతో హల్‌చల్ చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ దాడి

- చొక్కా చింపి పిడిగుద్దులు గుద్ది..
- ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలోనే పేట్రేగిన వైసీపీ మూకలు


ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న వీరశేఖర్ తదితరులు

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'హౌసింగ్ బిల్లుల్లో అక్రమాలపై వార్తలు రాస్తావా..? నీకెంత ధైర్యముంటే మాపై వార్తలు రాస్తావ్..? మీ అంతు చూస్తాం..' అంటూ వైసీపీ నాయకులు మూకుమ్మడిగా మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌పై దాడికి దిగారు. మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హెల్త్ క్లీనిక్, మద్దికెర-బీఎన్‌పేట రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమం కవరేజీ కోసం ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌తో పాటు వివిధ పత్రికలు, మీడియా పాత్రికేయులు సైతం వెళ్లారు. ప్రోగ్రాం సమీపంలో విలేకరులు వార్తసేకరణలో ఉండగా.. మద్దికెరకు చెందిన వైసీపీ నాయకుడు, వీఆర్వో తమ్ముడైన రంగస్వామి, మరికొంత మంది వైసీపీ నాయకులు ఒక్కసారిగా పేపరులో రాయడానికి వీలుకాని పదాలతో దూషిస్తూ దాడికి తెగబడ్డారు. వీరశేఖర్ చొక్కా పట్టుకుని, చొక్కా చింపేసి చేతులతో బలంగా కొట్టారు. ఊహించని సంఘటనతో మేల్కొన్న పక్కనే ఉన్న ఈనాడు విలేకరి తిక్కన్న, తెలుగు ప్రభ విలేఖరి సుల్తాన్‌బాషా తదితరులు అడ్డుకుని శేఖర్‌కు రక్షణగా నిలిచారు. అక్కడి నుంచి వారు వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయంపై మద్దికెర ఎస్ఐ రమేష్‌బాబుకు బాధిత విలేకరి వీరశేఖర్ స్థానిక విలేకరులతో కలిసి ఫిర్యాదు చేశారు.

ఉదయం అలా...



సాయంత్రం ఇలా...



అధికారుల మధ్య కూర్చున్న ఈయన.. చేయి పైకెత్తి కేకలు వేస్తున్న ఆయన ఇద్దరూ ఒక్కరే. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బెల్లం మహేశ్వరరెడ్డి చైర్మన్ హోదాలో ఇలా హాజరు కాగా... సాయంత్రానికి ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడిలో నినాదాలు చేస్తూ, కేకలు వేస్తూ ఇలా కనిపించారు.

టీమ్ వర్క్‌గా పని చేయాలి : డీఐజీ


డీపీవోను తనిఖీ చేస్తున్న డీఐజీ, ఎస్పీలు

కర్నూలు, ఫిబ్రవరి 20: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ టీమ్ వర్క్‌గా పని చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాలు, రికవరీ, రోడ్డు ప్రమాదాలు, రాత్రి గస్తీ తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల లోకేషన్లు, సీసీ కెమెరాల గురించి ఆరా తీశారు. లైసెన్సులు ఉన్న ఆయుధాలను డిపాజిట్ చేయించాలని, రౌడీషీటర్లు ట్రబుల్ మాంగర్లపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీపీవోలను సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్, పరేడ్ మైదానాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, శివనారాయణ స్వామి, సీతారామయ్య, ట్రైనీ డీఎస్పీ భావన పాల్గొన్నారు.

మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ఆదోని, మెడికల్ కాలేజీ, ప్రభుత్వాసుపత్రి నర్సింగ్ కాలేజీలో నాలుగు పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం విడుదల చేశారు. ఆడియో విజువల్ టెక్నీషియన్, స్టోర్ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండర్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

ఛలో విజయవాడకు సిద్ధం

- సీఎంను నమ్మి మోసపోయాం
- ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వాలి
- 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి
- 12వ పీఆర్సీ కమిషన్ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలి
- ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ వెంగళ్‌రెడ్డి
- కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగుల ధర్నా



కర్నూలు జడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ జేఏసీ, ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: పెండింగ్‌లో ఉన్న కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోతే ఈ నెల 27న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు ఛలో విజయవాడకు సిద్ధమని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు జిల్లా పరిషత్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. 11వ పీఆర్సీని రివర్స్ పీఆర్సీగా అభివర్ణించారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని, ఇప్పటి వరకు ఉన్న బకాయిలను చెల్లించాలని కోరుతూ ఉద్యోగులు రోడ్ల మీదకు రావలసిన పరిస్థితి ఏర్పడ్డం సిగ్గుచేటన్నారు. 12వ పీఆర్సీ అమలు చేసే వరకు ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని అమలు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ హృదయరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌ను ఉద్యోగులు నమ్మి మోసపోయారని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగులకు కోట్ల రూపాయలు బకాయిలు పడిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంటు, 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు పేరిట 30 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 70ఏళ్ల వారికి 10 శాతం 75పై బడ్డ వారికి 15 శాతం ఇవ్వాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి 104 సంఘాల మద్దతుతో ఉద్యోగులు ఈ నెల 27న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ నగర చైర్మన్ కాశన్న, ప్రధాన కార్యదర్శి జవహర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, యూటీఎఫ్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు సురేష్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎల్లప్ప, హేమంత్ కుమార్, నాల్గో తరగతి ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, బలరాం రెడ్డి, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం అధ్యక్షులు రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

15 ఏళ్లకే ఓటు హక్కు...?

- దరఖాస్తు చేసుకున్న యువకులు
- దొంగ ఓట్ల నమోదుకు తెరలేపిన వైసీపీ నాయకులు


వి.ఎల్లమ్మ


బి.స్పందనకు ఓటరు కార్డుకు అప్లయ్ చేసిన రషీదు


కురువ అనిల్ ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసిన ఫారం

కోసిగి, ఫిబ్రవరి 20: అర్హత లేని వారు కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన ఓ ఇద్దరు వైసీపీ యువకులు ఈ దొంగ ఓట్ల నమోదుకు తెరలేపారు. 9, 10వ తరగతుల విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ఎత్తుగడ వేశారు. కర్ణాటకకు చెందిన వారికి సైతం ఓటు హక్కు కల్పించేందుకు ప్రణాళికలు రచించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మద్దిలిపేట్ గ్రామానికి చెందిన వడ్డె ఎల్లమ్మ 1-6-2009న (ఆధార్ నెంబరు 767494050869) జన్మించింది. ఇప్పటికి ఎల్లమ్మ వయస్సు 15 ఏళ్లు ఉంటుంది. ఆన్‌లైన్‌లో మాత్రం 06-01-2003లో జన్మించినట్లు నమోదు చేసి కొత్త ఓటరుకు నమోదు చేశారు. అసలు మన రాష్ట్రం కాని, 18 ఏళ్లు కూడా నిండని బాలికకు ఓటరు నమోదు చేయడం గమనార్హం. అలాగే అగసనూరు గ్రామానికి చెందిన బి.స్పందన అనే యువతి కోసిగిలోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఇప్పటికి బాలిక వయస్సు 14 ఏళ్లు మాత్రమే. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కొత్త ఓటరు ఫారంలో మాత్రం పుట్టిన తేదీ 11-2-2005గా నమోదు చేశారు. అగసనూరు గ్రామానికి చెందిన కురువ వీరేష్ పుట్టిన తేదీ ఆధార్ కార్డు ప్రకారం 1-1-2010గా ఉంది. ఈ విద్యార్థి ప్రస్తుతం ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.. ఓటరులో నమోదు చేసిన ఫారంలో మాత్రం పుట్టిన తేదీ 10-2-2005గా ఉంది. 14 సంవత్సరాలకే ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం నమోదు చేశారు. ఇప్పటికే కొత్తగా ఆ గ్రామం నుంచి 24 మంది ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా అందరూ తక్కువ వయస్సు ఉన్న వారే కావడం గమనార్హం.

మా దృష్టికి వచ్చింది.. చర్యలు తీసుకుంటున్నాం

తక్కువ వయస్సు ఉన్న వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న మాట వాస్తవమే.. మా దగ్గరకు ఆ ఫారాలు ఆన్‌లైన్‌లో వచ్చాయి. అయితే.. వాటిని పరిశీలించి రిజక్ట్ చేస్తున్నాం. ఎవరైనా సరే తక్కువ వయస్సున్న వారిని ఓటరుగా నమోదు చేసినా, ఇతర రాష్ట్రాల వారివి చేర్చినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

- మురళి, తహసీల్దార్

2047 నాటికి అగ్రగామిగా భారత్

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- వర్చువల్ విధానంలో కర్నూలు ఐఐఐటీడీఎం ప్రారంభం


వర్చువల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

డిప్యూటీ సీఎం అంజాద్ భాషా


కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 20: వికసిత్ భారత్ సంకల్ప్‌తో 2047 నాటికి ప్రపంచంలో భారత్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. మంగళవారం వర్చువల్ విధానంలో కర్నూలు ఐఐఐటీడీఎంను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను మిషన్ మోడ్‌లో భర్తీ చేస్తున్నామని తెలిపారు. టెక్నాలజీ సెక్టార్‌లో భారత్‌ను వచ్చే శతాబ్దంలో అగ్రగామిగా నిలిపేందుకు కర్నూలు ఐఐఐటీడీఎంను నిర్మించినట్లు పేర్కొన్నారు. గత పదేళ్లలో కేంద్ర విశ్వవిద్యాలయాలు, సెంట్రల్ ఫండింగ్ ఇనిస్టిట్యూషన్స్, నవోదయ పాఠశాలలు ఎక్కువగా నెలకొల్పామని చెప్పారు. సబ్ కా సాత్.. సబ్‌కా విశ్వాస్‌లో భాగంగా ఐఐఐటీడీఎం కర్నూలు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేశామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 12వ స్థానం నుంచి 5వ స్థానానికి ఎగబాకిందని ప్రధాని మోదీ చెప్పారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ఐఐటీడీఎం కర్నూలు ఇచ్చినందుకు కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్ మాట్లాడుతూ తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఈ సంస్థ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కర్నూలు ఐఐఐటీడీఎం చైర్మన్ ప్రొఫెసర్ రంగనాథ్ మాట్లాడుతూ అతిత్వరలోనే ఈ విద్యాకేంద్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తామన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీఎల్ఎన్ సోమయాజులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఈ క్యాంపస్‌ను దేశానికి అంకితం చేయడం ఎంతో శుభపరిణామమన్నారు. కళాశాలలో 907 మంది విద్యార్థులు, 40 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ, 10 మంది అనుబంధ ఫ్యాకల్టీ, ఒక ప్రొఫెసర్ ప్రాక్టీసు, 19 మంది రెగ్యులర్ నాన్ టీచింగ్ సిబ్బందితోపాటు ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ గురుమూర్తి, ఫ్యాకల్టీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు ఐఐఐటీడీఎం

అప్రజాస్వామిక చర్యలు

దాడులను ఖండించిన మేధావులు, రాజకీయ, ప్రజా సంఘాలు

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై జరుగుతున్న వరుస దాడులను రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. అనంతపురం సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని మరువక ముందే కర్నూలు ఈనాడు కార్యాలయంపై కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరుల దాడి, పత్తికొండలో ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ నాయకుల దాడి లాంటి దుశ్చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

దాడులు అక్రమం



ఈనాడు కార్యాలయంపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం అక్రమం. ఇది సిగ్గు చేటు చర్య. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన ఆయన వర్గీయులు పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. వ్యతిరేక కథనాలు రాస్తే దాడులు చేస్తారా..? ఈ ఆటవిక చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- గౌరు చరిత, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి

తీవ్రంగా ఖండిస్తున్నాం



రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి.. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడి చూస్తుంటే.. ఈ సమాజం ఎక్కడకు పోతుందో అనిపిస్తుంది. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం ఉందా..? రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలను జగన్ నిర్వీర్యం చేయడమే కాకుండా పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు. ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిని, మద్దికెర విలేకరి శేఖర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కార్యాలయాలపై దాడులు అమానుషం



మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌తో పాటు ఈనాడు కార్యాలయంపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి దాడులు రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తాయి. తప్పులను ఎత్తిచూపడం పత్రికల బాధ్యత. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ ఇలాంటి దాడులకు పాల్పడుతోంది.

- రాంపుల్లయ్య యాదవ్, టీడీపీ నాయకుడు

కఠిన చర్యలు తీసుకోవాలి



ఈనాడు కార్యాలయంపైన, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి చర్యలు మున్ముందు జరగకుండా కఠిన కేసులు నమోదు చేయాలి. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి.

- ఈఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే, జిల్లా అధ్యక్షుడు

'సీఎం జగన్ ప్రేరేపిత దాడులు ఇవి...'



దాడి జరిగిన ఈనాడు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూకల దాడులు, మద్దికెరలో వార్తలు రాశారని ఆంధ్రజ్యోతి విలేఖరి వీరశేఖర్‌పై వైసీపీ దాడులు చూస్తుంటే.. పక్కా ప్రణాళిక ప్రకారం దాడులు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముమ్మాటికీ సీఎం జగన్ ప్రేరేపిత దాడులు ఇవి. నగరం నడిబొడ్డులో ఉన్న ఈనాడు కార్యాలయం లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నాలు చేయడం, అద్దాలు, తలుపులు ధ్వంసం చేయడం, రాళ్లు రువ్వడం చూస్తుంటే.. సమాజం ఎక్కడకు పోతుందోనని అనుమానం కలుగుతోంది. దీనిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాల్సి ఉంటుంది.

- ఐవీ సుబ్బారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం జగన్ సమాధానం చెప్పాలి



ఈనాడు కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరుల దాడిని ఖండిస్తున్నాం. మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, నేడు మద్దికెరలో వీరశేఖర్‌పై దాడుల వెనుక వైసీపీ కుట్ర దాగి ఉంది. పత్రికా స్వేచ్ఛను హరించేందుకు జగన్ ప్రభుత్వం పావులు కదుపుతోంది. భౌతికదాడులతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే దుశ్చర్యలకు వైసీపీ పాల్పడుతోంది. వైసీపీ మూకల అరాచకాలపై సీఎం వైఎస్ జగన్ సమాధానం చెప్పాలి

-కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

ఇది దుర్మార్గమైన చర్య



కర్నూలులో ఈనాడు కార్యాలయంపై, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమైన చర్య. భవిష్యత్తులో ఇలాంటి అరాచకాలపై కఠిన చర్యలు ఉన్నప్పుడే ఇలాంటి దాడులు జరగవు. పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రోజురోజుకు వైసీపీ అరాచకాలు పెరిగిపోతున్నాయి.

- గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి



'దాడులు హేయం..'

కర్నూలు రాజ్‌విహార్‌లోని ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై ఎమ్మెల్యే కాటసాని అనుచరులు దాడులు చేయడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌లు తీవ్రంగా ఖండించాయి. కాటసాని అనుచరులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని కంప్యూటర్లు ధ్వంసం చేసి, తలుపులు పగులకొట్టడం, మీడియాను భయభ్రాంతులు చేసే చర్యలు నిజాలు కప్పి పుచ్చలేవన్న విషయాన్ని కాటసాని గుర్తించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, ఆంజనేయులు, బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు దాడులను ఖండించారు.

వైసీపీకి పరిపాటిగా మారింది

జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం వైసీపీకి పరిపాటిగా మారింది. ఇదంతా పక్కా ప్లాన్‌తోనే జరుగుతోంది. సీఎం జగన్ డైరెక్షన్‌లో ఆ పార్టీ నాయకులు పయనిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రతికా స్వేచ్ఛను ఖూనీ చేస్తున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి.

- పీజీ నరసింహులు యాదవ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దాడి అమానుషం

ఏపీయూడబ్ల్యూజేఎఫ్

కర్నూలు, ఫిబ్రవరి 20: ఈనాడు కార్యాలయంపై కాటసాని అనుచరుల దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఖండించారు. మీడియా వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఇలాంటి దాడులు చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి జరిగినా, దుర్భాలాషలాడినా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసేలా సుప్రీంకోర్టు తీర్పుఇచ్చినా కూడా దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఘటనలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని తెలిపారు.

పత్తికొండలో చోరీ..

- 12 తులాల బంగారం, 50 వేల నగదు అపహరణ
- తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగ



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం

పత్తికొండ, ఫిబ్రవరి 20 : తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు 12 తులాల బంగార, రూ 50వేల నగదను దోచుకెళ్లారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పత్తికొండ పట్టణం అంబేడ్కర్ సర్కిల్ సమీపంలోని పాతపెట్రోల్ బంకు వెనుక ప్రాంతంలో కురువ అనసూయమ్మ కూతురు రాశితో కలసి నివసిస్తోంది. ఆమె భర్త హనుమంతు చాల సంవత్సరాల క్రితం మరణించాడు. రాశికి మూడేళ్ల కింద ఆర్మీ జవాన్‌తో వివాహమైంది. అతను విధి నిర్వహణలో భాగంగా దేశ సరిహద్దుల్లో ఉండటంతో వివాహం తర్వాత కూడా రాశి తల్లి వద్దనే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం తల్లీ కూతుళ్లు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు తీసి ఉన్నట్లు గమనించారు. బీరువాలో ఉంచిన బంగారు, నగదు చోరికి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ మురళీమోహన్, ఎస్ఐ వెంకటేశ్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. బీరువా తాళాలు బట్టల కిందపెట్టి ఉండడంతో దొంగలు బీరువాను తెరచి అందులో ఉన్న బంగారు, నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ పుటేజీల ఆధారంగా సోమవారం రాత్రి ఓ యువకుడు ఇంట్లోకి వెళ్లి తిరిగి 15 నిమిషాల తర్వాత పోవడం గుర్తించారు. పూర్తిస్థాయిలో విచారణచేసి దొంగను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల విధులకు సన్నద్ధమవ్వండి

నోడల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేటాయించిన విధుల్లో నోడల్ అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులు, ఆర్వోలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ఇంకా సమయం ఉందనే అలసత్వం వహించకుండా కేటాయించిన విధుల నిర్వహణకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. మెటీరియల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రికార్డులు నిర్వహించాలని సూచించారు. గురువారం సెక్టార్ అధికారులకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. హోం ఓటింగ్ నిర్వహణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ పేపర్లు, ఈటీపీబీఎస్‌కు సంబంధించి ప్రతి నియోజకవర్గంలోని 8 డిస్పాచ్ సెంటర్లలో 8 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగాయి. ఒకేషనల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు, జనరల్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు 11 నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. ఒకేషనల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 3509 మంది విద్యార్థులు హాజరయ్యారు. 25 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1981 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1525 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే జనరల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 14,534 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఎంపీసీ విద్యార్థులు 9750 మంది, బైపీసీ గ్రూపు విద్యార్థులు 4784 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్ఐవో, జిల్లా కన్వీనర్ ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో డీవీఈవో జమీర్ పాషా, డీఈసీ కమిటీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, జి.లాలెప్ప, ప్రభు, స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

న్యూరో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం



కర్నూలు జీజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: రాష్ట్రంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారిగా న్యూరో స్ట్రోక్ యూనిట్ (పక్షవాతం)ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా.జి. సృజన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాకు 2వ ఫ్లోర్‌లో న్యూరో ఇంటెన్సివ్ కేర్ స్ట్రోక్ యూనిట్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, న్యూరాలజీ హెచ్‌వోడీ డా.సి. శ్రీనివాసులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ బీపీ ఎక్కువ కావడం వల్ల మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి కణితులు రావడం, మెటిబాలిన్ సమస్యలు మొదలైనవాటితో చాలా మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 12 పడకలతో న్యూరో ఇంటెన్సివ్ కేర్ స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభించామన్నారు.ఈ యూనిట్‌లో శిక్షణ పొందిన నర్సులు అనస్థీషియా సిబ్బంది, న్యూరాలజిస్టులు, వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్రంలోనే ఈ యూనిట్ మొట్టమొదటిదని, దీని వల్ల అక్యూట్ మెడికల్ కేర్ (కేఎంసీ) విభాగంపై భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సుధాకర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, మెడిసిన్ హెచ్‌వోడీ డా.రాజశేఖర్, ప్రొఫెసర్లు లక్ష్మి, విద్యాసాగర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎగబాకిన పత్తి ధర



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు పెరుగుతున్నాయి. ఐదు రోజులుగా పత్తి ధరలు ఆశించిన స్థాయిలో పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం గరిష్ఠంగా పత్తి ధర క్వింటం రూ.7,419 పలికింది. ఇప్పటికే చిన్న, సన్నకారు రైతులు పత్తి ధరల కోసం వేచి చూసి ధరలు పెరగకపోవడంతో 90 శాతం మంది విక్రయించుకున్నారు. పత్తి విక్రయాలు పేలవంగా సాగుతున్నాయి. పరిశ్రమల్లో ఉత్పత్తికి అవసరమైన పత్తి లేకపోవడంతో డిమాండ్ పెరిగింది. దీంతో పత్తికి డిమాండ్ పెరిగి ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లోనూ దూది ధరలు స్వల్పంగా పెరిగాయని తెలిపారు. వారం రోజుల్లో పోల్చితే పత్తి ధర క్వింటాకు రూ.400 పైగా పెరిగింది. పత్తి విక్రయించుకున్నాక ధరలు పెరగడంపై రైతులు నిరాశ చెందుతున్నారు. 1,082 క్వింటా పత్తి మార్కెట్ యార్డుకు విక్రయానికి రాగా, క్వింటం గరిష్ఠంగా రూ.7,419, కనిష్ఠంగా రూ.4,687, మధ్యస్థ ధర రూ..6,969 పలికింది.

పేదల సాగు భూముల్లో ఇంటి స్థలాలా?

- రాజకీయకక్షతోనే పట్టాల పంపిణీ
- ఇంకే ఖాళీ స్థలం కనపడలేదా?
- రైతులపై రాజకీయ కక్ష సాధింపు
- అండగా ఉంటామన్న గౌరు చరిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



పాలకొలనులో పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 20: పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూముల్లో రాజకీయ కక్షతోనే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత రెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలకొలను గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములను గౌరు చరిత, రాజశేఖర్‌తో పాటు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల టీడీపీ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డితో పాటు బాధిత రైతులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరు చరిత మాట్లాడుతూ 151 సర్వే నెంబరులో 60 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూముల్లో ఆరుగురు రైతులు 11 ఎకరాలు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగు భూమిగా తయారు చేసుకుని నిమ్మ, పొగాకు మిరప తదితర పంటలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఏడు సంవత్సరాలుగా పాస్ పుస్తకాల కోసం అధికారులు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌తో కూడా మాట్లాడామన్నారు. అవసరమైతే బాధితుల తరఫున కోర్టుకు వెళ్లేం దుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, మహబూబ్‌బాషా, చదువుల సుధాకర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 20: సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో గత పదిరోజులుగా కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం స్వామి అమ్మవార్ల చక్రస్నానంతో ముగిశాయి. ఇందులో భాగంగా వేకువ జామున స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య తుంగభద్ర నదికి తీసుకువెళ్లి చక్రస్నానం కార్యక్ర మాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజ్యసభ మాజీ సభ్యు డు టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. స్వామివారి చక్రస్నానం సమయంలో ఆకాశంలో గరుడ పక్షి విహరించడంతో భక్తులు ఆనందభరితులయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఏటా బ్రహ్మోత్సవాలు ప్రారంభ సమయంలో, చక్రస్నానం వేడుకలో ఆకాశంలో గరుడ పక్షి ప్రదక్షిణ చేయ డం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సం ఘం అధ్యక్ష, కార్యదర్శులు కళ్లే చంద్రశేఖర శర్మ, హెచ్‌కే రాజశేఖర్, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, సభ్యులు కేజీ ప్రభాకర్‌రావు, శివరామ ప్రసాద్, బాలసత్యనారాయణ, కేవీ సుబ్బారావు, సుదర్శన్, సూర్యనారాయణ, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులతో తరలివెళ్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

క్యాజువాల్టీలో రోగుల నరకయాతన

- గంటల్లోనే అడ్మిషన్ అంటున్న సూపరింటెండెంట్
- నాలుగు గంటలైనా అడ్మిషన్ చేయించుకోని వైద్యులు



ఎక్స్‌రే ఫిల్మ్ కోసం వేచి చూస్తున్న అనంతపురం జిల్లా వాసి చందానాయక్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అత్యవసర రోగులు క్యాజువాల్టీలో నరకయాతన అనుభవిస్తున్నారు. ఓ పక్క ఆసుపత్రి సూపరింటెండెంట్ క్యాజువాల్టీకి వచ్చిన రోగులు గంటలోపు అడ్మిషన్ చేయించుకుని వార్డుకు షిఫ్ట చేయాలన్న ఆదేశాలు బేఖాతరు అవుతున్నాయి. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కదిలిపల్లెకు చెందిన 65 ఏళ్ల చందా నాయక్ కడుపులో గడ్డ ఉంటే అనంతపురం జీజీ హెచ్ వైద్యులు రెఫర్ చేస్తే మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. క్యాజువాల్టీ ఓపీ తీసుకుని వైద్యుల దగ్గరకు వెళ్లారు. వైద్యులు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ రాసి ఇచ్చారు. ఈ పరీక్షలు చేయించుకుంటే తాము అడ్మిషన్ చేయించుకుంటామని చెప్పారు. దీంతో రోగి చందా నాయక్ తన కుమారున్ని వెంట తీసుకుని స్ట్రెచ్చర్ కోసం ప్రయత్నించారు. డబ్బులు అడగడంతో ఎక్స్‌రే నడుచుకుంటూ వెళ్లి పరీక్ష చేయించుకున్నారు. తర్వాత అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు వెళ్లగా రేడియాలజి వైద్యులు ఎక్స్‌రే ఫిల్మ్ గానీ లేదా ఫొటో తీసుకుని రావాలని చెప్పారు. ఈ విషయాన్ని వైద్యులకు (హౌస్‌సర్జన్లు) చెప్పగా వస్తాంలే అని దాట వేశారు. సాయంత్రం 5 గంటలవుతుండటంతో ఓ వ్యక్తి వచ్చి ఎక్స్‌రే వార్డు దగ్గరకు రోగికి తీసుకెళ్లారు. అక్కడ ఎక్స్‌రే సిబ్బంది స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని, దానిలో ఫిల్మ్ ఫొటో ఇస్తామన్నారు. తమ దగ్గర స్మార్ట్ ఫోన్ లేదని చిన్న ఫోన్ ఉందని చెప్పడంతో వెనుదిరిగారు. మరో వ్యక్తి వచ్చి స్మార్ట్ ఫోన్‌లో ఎక్స్‌రే ఫొటోను తీసుకుని రోగిని రేడియాలజి విభాగానికి తీసుకెళ్లి సాయంత్రం 7 గంటలకు స్కానింగ్ చేయిం చారు. మధ్యాహ్నం 3 గంటలకు వచ్చిన రోగికి స్కానింగ్, ఎక్స్‌రే పరీక్షకు 4 గంటలు సమయం పట్టడం, ఇక రోగి అడ్మిషన్ కాకుండా క్యాజువాల్టీలో ఉండటం అక్కడ పరిస్థితిని అద్దం పడుతుంది.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గంగపుత్రుల సంఘం నాయకులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 20: నగరంలోని గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భీష్మ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గంగపుత్రులంతా సంఘటితంగా ఉండాలని, పరస్పర సేవా సహకారాలతో ముందుకు పోవాలని అన్నారు. కార్యక్రమంలో కుల పెద్ద రామయ్య, నగర కమిటీ అధ్యక్షుడు ఆనందరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కదిరి రమేష్, ఉపాధ్యక్షుడు జలగరి వెంకటేశ్వర్లు, నగర ప్రధాన కార్యదర్శి టీఎన్ఆర్, కోశాధికారి వెంకటేశ్ బాబు, ఈసీ మెంబర్లు శ్రీనివాసులు, నాగరాజు, యువజన విభాగం ఉపాధ్యక్షుడు అంజి, శ్రీరామ్, టి.నాగరాజు పాల్గొన్నారు.

'రైతుల ఆదాయాన్ని పెంచండి'

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. హాజరైన చైర్మన్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులకు గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందులను రైతుభరోసా కేంద్రాల ద్వారా సక్రమంగా అందించాలని సూచించారు. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి మా ట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకృతి వ్యవ సాయం ద్వారా పంటలను సాగు చేస్తున్న రైతులకు ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. కార్యక్ర మంలో ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి, పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య, మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మత్స్య శాఖ ఏడీ శ్యామల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 20: నగరంలోని 17వ వార్డులో ఉన్న ఎల్ బీజీ నగర్‌వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ ఎల్‌పీజీ నగర్‌లో గత ఏడాది మే 5న రూ.37లక్షల ఆర్థిక సంఘం నిధులతో మురుగు కాలువల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారని అన్నారు. అవసరానికి మించి గుంతలు తవ్విన కాంట్రాక్టర్లు కనపడకుండ పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇళ్లలోని నుంచి బయటికి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు, ఇంజనీర్లు స్పందించి మురుగు కాలువల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సభ్యులు ఎస్ఆర్.గౌడు, బిజాని, ఖైరున్‌బీ, సామేల్, జాకీర్ ఉన్నారు

ఈవీఎంలపై శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 20: కర్నూలు నియోజకవర్గ పరిధిలోని సెక్టోరల్ ఆఫీసర్లు, పోలీసులకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో ఈవీఎంల వాడకం, వర్క్‌షాపుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



సి.బెళగల్, ఫిబ్రవరి 20: మండలంలోని బ్యాథోలి గ్రామంలో మంగళవారం రామలక్ష్మమ్మ, బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్ద రామచంద్రరెడ్డి ఆధర్యంలో రామలక్ష్మమ్మ, బంగారమ్మ విగ్రహాలను పురోహితుడు నరసింహయ్య వేదమంత్రాలతో ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, గ్రామస్థులు పాలొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 20: దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుం దని, ప్రజలు విసిగి కాంగ్రెస్ వైపు చూస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు అధ్వర్యంలో నగర కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లకు కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఈసమావేశంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, నాయకులు దామోదరం రాధాకృష్ణ, జాన్ విల్సన్, వెంటకన్న, బతు కన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ.వెంకట సుజాత, లాజరస్, సత్యనారాయణ గుప్త, ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

'పనిదినాలు వినియోగించుకోండి'



పనులను పరిశీలిస్తున్న ఏపీవో మోదీన్ సాహెబ్

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 20: కరువు మండలాల్లో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అదనంగా 50 పనిదినాలు కల్పించిందని ఏపీవో మోదీన్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం గోరంట్ల గ్రామంలో చెక్‌డ్యాం పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను వినియోగించుకోవాలని కోరారు. నిర్ణీత కొలతల మేర పనులు పూర్తి చేసుకుంటే రూ.272 వేతనం అందుతుందని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున్న ఉదయాన్నే పనులకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పురుషోత్తం, రాజు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

▸ విద్యార్థులతో టీజీ భరత్ ముఖాముఖి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 20: కర్నూలులో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళ వారం కర్నూలు నగరం శివారులోని పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు ప్రాముఖ్యత, విద్యార్థుల భవిష్యత్ అనే అంశంపై విద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్న క్యాంటిన్లు మళ్లీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమిశెట్టి నవీన్, అబ్బాస్, నంద్యాల నాగేంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందిస్తాం: టీడీపీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమపథకాలు అందిస్తామని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 43 వార్డు ఇందిరా గాంధీనగర్, పీవీ నరసింహారావు నగర్‌లలో ఆయన భరోసాయాత్ర చేపట్టారు. ఈ సంద్భంగా ప్రజలు తమకు సొంత ఇళ్లు లేవని, పింఛన్లు తొలగించారని, డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి, యేసు, నాగాశ్వరచౌదరి, రవికుమార్‌రెడ్డి, భాగ్యమ్మ, హనుమంతరావు చౌదరీ, అంజి. భాస్కర్, ఈశ్వరయ్య, జనసేన రాయలసీమ ఎన్నికల కన్వీనర్ పవన్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

టీడీపీలో చేరిక: లక్కి టూ గోపినాథ్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి నుంచి టీడీపీలోకి పలువురు యువకులు చేరారు. మంగళవారం నగరంలోని 48వ వార్డులో కారల్ మార్క్స్ నగర్‌కు చెందిన యువకులకు టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మన్సూర్ ఆలీఖాన్, దేవా, సౌభాగ్యమ్మ, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల యాప్‌లను రద్దు చేయాలి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: అంగన్‌వాడీ వర్కర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. నాలుగు యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు బాలదుర్గమ్మ అధ్యక్షతన యూనియన్, సీఐటీయూ నాయకులు కర్నూలు అర్బన్ సీడీపీవో అనురాధకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, నాలుగు యాప్‌లను రద్దు చేయాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగుల ఫేస్ యాప్ ఇతర యాప్‌లు సరిగ్గా పని చేయనందున డేటా ఎంట్రీ చేయడానికి యాప్‌లు ఓపెన్ కాక అధికారుల ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మహేశ్వరి, క్రిష్ణవేణి, సువర్ణ పాల్గొన్నారు.



సీడీపీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వైసీపీ దౌర్జన్యాలే.. టీడీపీ విజయ సోపానాలు

గౌరు చరిత, మల్లెల రాజశేఖర్



హుశేనాపురం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న దౌర్జన్యాలే తెలుగుదేశం పార్టీకి విజయ సోపానాలని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభను కవరేజి చేసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీటీసీ చిన్నమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు, తెలుగు యువత అధ్యక్షుడు రామచంద్రుడు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ సుధాకర్, నాయకులు మల్లెల ప్రశాంత్, లక్ష్మీకాంతరెడ్డి, అల్లాబాబు, బజారు, జగదీష్, ఘడేకల్లు శేఖర్, వడ్డె నారాయణ, జయకృష్ణ, కాటినేని నారాయణ, వేణు, రామగోవిందు, వడ్డె రవి, గువ్వ రవికుమార్, శేఖరప్ప, నాగరాజు, అన్వర్ బాషా పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

సి.బెళగల్, ఫిబ్రవరి 20: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో వసంతప్ప శావను పురస్కరించుకుని మంగళవారం గ్రామ పెద్దల సమక్షం లో కబడ్డీ పోటీలను ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వసంతప్ప శావను సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు 8 టీంలు వచ్చాయన్నారు. ఈ పోటీలు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

11 దుకాణాలకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 20: అశోక్‌నగర్ పంప్‌హౌస్ సమీపంలో నిర్మించిన నూతన దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. పాత కౌన్సిల్ హాలులో మంగళవారం మున్సిపల్ మేనేజర్ చిన్నరాముడు పర్యవే క్షణలో 11 దుకాణాలకు వేలం నిర్వహించారు. మొత్తం 5 సంవత్సరాలకు సంబంధించి గుడ్‌విల్ రూ.1.29 కోట్లు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 లక్షలకు వ్యాపారులు దక్కించున్నారు. దీంతో గుడ్‌విల్, సెక్యూరిటీ డిపాజిట్ మొత్తం కలిపి రూ.1.34 కోట్లు ఆదాయం వచ్చింది. ఇందులో జనరల్, ఎస్టీ, ఎస్సీ, విభిన్నప్రతిభావంతులు, టీఎల్ఎఫ్/ఎస్ఎల్ఎఫ్, బీసీ నాయీబ్రాహ్మణుల రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించారు. ఐదేళ్ల కాలపరిమితితో నిర్వహించిన దుకాణాలకు సర్వసభ్య సమావేశంలో కేఎంసీ ప్రైడ్ ప్లాజా వెంకటరమణ కాలనీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అని తీర్మానం చేశారు. ఈ వేలంలో రెవెన్యూ ఆఫీసర్ జునైద్, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఆర్‌ఐలు సొహై ల్, వాజిద్, సాజిద్, ఖలీల్, మన్సూర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



శకునాలలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 20: మండలంలోని శకునాల గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. గడప గడపకు గోవు గోవిందుడు గీత లక్ష్య సాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న జనజాగారణ కార్యక్ర మంలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున శకునాల గ్రామానికి చేరుకున్నారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల కలాణ్యాన్ని జరిపించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. చెన్నకేశవస్వామి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 20: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, మాస్‌లైన్ ఆలిండియా యూనిట్ మహాసభ మార్చి 3 నుంచి 5 వరకు ఖమ్మం జిల్లాలో జరుగుతుందని, ఈ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు అర్లప్ప పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పోస్టర్‌లను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్లప్ప మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మూడు కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ ఎంఎల్ (ప్రజాపంథా), పీసీసీ సీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్)ఆర్‌ఐలు ఏకమై సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పేరుతో ఏర్పడిందని తెలిపారు. దేశంలో మోదీ ప్రభుత్వం మతం పేరుతో దేశ ప్రజలను విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని, ఇది ప్రజలు గ్రహించాలని అన్నారు. దేశ రాజధాని డిల్లీలో రైతులు వారి డిమాండ్ల సాధనకు నిరసన చేస్తుంటే వారిపై అత్యంత పాశవికంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు తిరుపాలు, పీడీఎ స్యూ నాయకుడు రాజేశ్, రాజు, మహేష్, మధు, అఖిల్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

రుద్రవరం, ఫిబ్రవరి 20: ఆళ్లగడ్డ మండలంలోని శాంతినగరం గ్రామం వద్ద ఆటో బోల్తా పడి తిరుపతయ్య (40) మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. కోవెలకుంట్ల మండలం లింగాల గ్రామంలో మిరపకాయల కోతకు వెళ్లిన రుద్రవరం గ్రామానికి చెందిన 12 మంది ఆటోలో తిరిగి వారి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే ఆటో ముందు టైరు పేలటంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలోని ఏడుగురు తీవ్రంగా గాయప డ్డారు. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో తిరుపతయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు. రూరల్ ఎస్ఐ నరసింహులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ చెప్పినవన్నీ అబద్ధాలే..

▸ సెల్ఫీచాలెంజ్ విసిరిన టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 20: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసిన అభివృద్ధిపై అనంతపురం జిల్లా రాప్తాడు సభలో సీఎం జగన్మోహ న్‌రెడ్డి జగన్ చెప్పినవన్నీ అబద్ధాలే అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఎర్రసాని నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల నాగేంద్రలు అన్నారు. మంగళవారం జిల్లాలో ట్రిబుల్ ఐటీ డీఆర్, ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రియల్ హబు, ఉర్దూ యూనివర్సిటీ, నగరంలో వెటర్నరీ పాలి క్లినిక్, సాంద్ర గోరైల అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేశారని సెల్ఫీలు దిగి చాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఇంటింటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాప్తాడు సభలో జగన్ చెప్పినవన్నీ నిజాలే అయితే ఆయన నిజాయితీ పరుడే అయితే చంద్ర బాబు విసిరిన సవాల్‌ను స్వీకరించాలన్నారు.



వెంటర్నరీ పాలీ క్లినిక్ చూపుతున్న నాగేశ్వరరావు యాదవ్

సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకం: ఉపకులపతి



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 20: సమాజంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకమైందని ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అంకన్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆరుణ, డాక్టర్ వెంకటరత్నం, విజయుడు, శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.కోట్లు ఖర్చు పెట్టి గాలికొదిలేస్తారా?

అసాంఘిక కార్యకలాపాల నిలయంగా కోల్డ్ స్టోరేజీ ప్లాంటు



కర్నూలు మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉన్న కోల్డ్ స్టోరేజీ ప్లాంటు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: కర్నూలు మార్కెట్ యార్డులో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.4 కోట్లతో కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణాన్ని చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఈ కోల్డ్ స్టోరేజీ ప్లాంటు పూర్త యితే గిట్టుబాటు ధర అందనప్పుడు తక్కువ అద్దెకు ఇందులో పంట ఉత్ప త్తులు నిల్వ చేసుకొనే అవకాశం రైతులకు ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణం పనులను మధ్యలోనే వదిలేసింది. కేంద్ర ప్రభుత్వం నిధులను పూర్తిగా విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోయిందని అంటున్నారు. ఇప్పటికే రూ.2.50 కోట్లను కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణానికి ఖర్చు చేశారు. ఏదో ఒకవిధంగా ఈ ప్లాంటును పూర్తి చేసి తమకు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

రైతు సమాఖ్య ఆధ్వర్యంలో చిరుధాన్యాల విక్రయం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: రైతు సమాఖ్య ద్వారా కలెక్టరేట్‌లోని మెయిన్‌గేటు వద్ద చిరుధాన్యాల విక్రయానికి మిల్లెట్ కేఫ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సమాఖ్య అధ్యక్షుడైన వేణుబాబు ఈ మిల్లెట్ కేఫ్‌లో అన్ని రకాల ఆర్గానిక్ చిరుధాన్యాలు అండుకొర్రలు, ఊదలు, సామలు, కొర్రలు, అరికెలు, రాగులు, జొన్నలు, సజ్జలతో తయారైన అన్నం, మిర్చర్, మురుకులతో పాటు రాగిముద్ద, జొన్నసంకటి, మిర్చర్, లడ్డూ బిస్కెట్లు తయారు చేసి విక్రయిస్తున్నట్లు సోమవారం విలేకరులకు తెలిపారు. చిరుధాన్యాల విక్రయం వల్ల రైతులు పండించే చిరుధాన్యాలకు గిట్టుబాటు ధర లభిస్తుందని, అదే విదంగా తక్కువ ధరకే నాణ్యమైన పంట ఉత్పత్తులను వినియోగదారులకు అందించగలుగుతున్నామని వేణుబాబు తెలిపారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఆహారోత్పత్తులు

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు



కె.మార్కాపురంలో పల్లెనిద్రలో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ భావన

గూడూరు, ఫిబ్రవరి 20: రానున్న ఎన్నికల్లో ఎవ్వరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ భావన హెచ్చరించారు. మంగళవారం కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కె మార్కాపురం గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ భావన, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భావన మాట్లా డుతూ ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించేందుకు అందరూ సహకరిం చాలన్నారు. ఘర్షణలకు పాల్పడకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించా లన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

చిన్న పాఠశాలలను ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: లోబడ్జెట్ పాఠశాలలన్నీ కార్పొరేట్, సెమి కార్పొరేట్ పాఠశాలల నుంచి వేరు చేసి చిన్న పాఠశాలలను కాపా డాలని కలెక్టర్ జి.సృజనకు అన్ ఎయిడెడ్ ప్రైవేటు స్కూల్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ మంగళవారం వినతి పత్రం అందజేశారు. అమ్మఒడి బెనిఫిషియర్స్ నుంచి డిటెక్ట్ చేసిన టాయిలెట్ల మెయింటెనెన్స్ ఫండ్‌ను ప్రభుత్వ పాఠశా లలకు ఇచ్చినట్లుగానే.. చిన్న పాఠశాలలకు ఇవ్వాలన్నారు. చిన్న పాఠశాలల ప్రభుత్వ గుర్తింపును పదేళ్ల నుంచి జీవిత కాలం పాటు రెన్యువల్స్‌ను పొడిగించాలన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో యూపీ ఎస్ఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్ సుదర్శన్, జిల్లా ప్రెసిడెంట్ ఎన్.కిష్టఫర్, ప్రధాన కార్యదర్శి సి.కుమార్, కోశాధికారి ఎం.శ్రీనివాసులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ట్రాక్టర్లను పట్టుకున్న సెబ్ సీఐ, ఎస్ఐ

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 20: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం తమకు అందిన సమాచారం మేరకు స్టేషన్ పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి-ఎర్రబాడు గ్రామాల మధ్య హంద్రీనది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నామన్నారు. ఒక్కో ట్రాక్టర్‌పై రూ.10వేల చొప్పున జరిమానా విధించి అమకతాడు, కోయిలకొండకు చెందిన వాహన డ్రైవర్లు సురేష్, రామక్రిష్ణ, చెన్నకేశవులపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, వీరుపాక్షిరెడ్డి, అఫ్రోజ్‌బాషా, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పథకాల అమలులో కేంద్ర విఫలం : కాంగ్రెస్

ఆదోని టౌన్, ఫిబ్రవరి 20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం అమలులో విఫలమైందని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌తో పాటు స్టవ్ అందజేయాల్సి ఉండగా, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.400 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, సీనియర్ నాయకులు సాయినాథ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుంకన్న, రామన్న, యాదవ్ పాల్గొన్నారు.

డాక్టర్ ఉమాదేవికి 'మహతి సాహితి కవి చక్రవర్తి' బిరుదు



డాక్టర్ ఉమాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: ప్రముఖ రచయిత్రి, కవయిత్రి ఆదోని ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ బల్లారి ఉమాదేవికి కరీంనగర్‌కు చెందిన మహతిసాహితి కవి సంఘం 'మహతి సాహితి కవి చక్రవర్తి' అనే బిరుదుతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల కింద హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన మాతృభాషా దినోత్సవం, 100 కవితల పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగిందన్నారు. అందులో తాను రచించిన ఆరవ పుస్తకం దేవి శతకం అనే శతక పుస్తకాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు అడిగోప్పల సాదయ్య, పోర్ల వేణుగోపాల్ రావు ఆవిష్కరించారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించే పాటను రాసి, పాడే అవకాశం కల్పించారన్నారు. పుస్తక రచయితగా తనకు బిరుదుతో సన్మానించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మరిన్ని పుస్తకాలు రాసి తెలుగు ఔన్నత్యాన్ని చాటుతానని ఆమె తెలిపారు.

ఆదోని అథ్లెటిక్స్‌కు జాతీయ స్థాయిలో పతకాలు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 20: పూణే (మహారాష్ట్ర)లో జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్రీడాపోటీల్లో పట్టణంలోని మాస్టర్ అథెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు పలు పతకాలను కైవసం చేసుకోవడం పటణానికి ఎంతో గర్వకారణమని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త రాచోటి సుధాకరయ్య అన్నారు. పోటీలలో రెండు బంగారు, ఒకటి వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకున్న క్రీడాకారుడు ఖాజా బందె నవాజ్‌తో పాటు, ఒక కాంస్య పతకం పొందిన మహిళా అథ్లెటిక్ ఎలిగే సీమాలను మంగళవారం ఘనంగా సన్మానించారు. అలాగే 50 సంవత్సరాలుగా టెన్నిస్ క్రీడాకారుడిగా రాణిస్తున్న గౌరవాధ్యక్షుడు రాచోటి సుధాకరయ్యను మర్చంట్ క్లబ్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్, కార్యదర్శి బద్రీనాథ్, విట్టా సురేష్, సుగురప్ప, న్యాయవాది దేశాయ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

ఆలూరు, ఫిబ్రవరి 20: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని నియోజకవర్గ అధికారి రాము నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ సౌకర్యం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్‌లు విజయ్ కుమార్, గుండాల నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఆలూరు యువకులు

ఆలూరు, ఫిబ్రవరి 20: సూపర్ సిక్స్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గతవారం మద్దికెరలో జరిగింది. ఈ స్టేట్ మీట్‌లో ఆలూరు పట్టణానికి చెందిన యువకులు నరసింహ, రసూల్, విజయ్ అనే క్రీడాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. వీరిని ఆలూరుకు చెందిన పీడీ చిన్నబాబు ప్రోత్సహించారు. ఈ ముగ్గురు క్రీడాకారులు కర్నూలు జిల్లా తరపున ఈ నెల 27వ తేదీన హిమాచల్ ప్రదేశ్, సిమ్లా నగరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడనున్నారు. అయితే క్రీడాకారులు సిమ్లాకు వెళ్లి ఆడే ఆర్థిక స్థోమత లేక దాతల కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి క్రీడా సామగ్రి, దుస్తులు, చార్జీలు కలిపి రూ.40వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. దాతలు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతం

మద్దికెర, ఫిబ్రవరి 20: మద్దికెర గ్రామ పంచాయతీ పరిధిలో రూ.లక్షలు విలువ చేసే గ్రామ పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని ఉప సర్పంచు భర్త ముస్లురు రామాంజులు, పంచాయతీ సభ్యులు ఎన్.లక్ష్మీనారాయణ, కురువ బాలచంద్ర ఆరోపించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రధాన రహదారికిరువైపులా పంచాయతీ స్థలాలను ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసి అద్దెలకు ఇస్తున్నారన్నారు. కొందరు వాటిని అమ్ముకున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి కూతవేటు దూరంలో పాత నీటి ట్యాంకు దగ్గర రూ.లక్షలు విలువ చేసే స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేసి అద్దెకు ఇచ్చారన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి మాట్లాడుతూ విచారణ చేసి పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని పేర్కొన్నారు.

అవయవదాత కుమార్తెకు అండగా నిలుద్దాం



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 20 : ఇటీవల కర్నూలులో బ్రెయిన్‌డెడ్‌కు గురై తన అవయవాలను దానం చేసిన పావనీలత కూతురు చిన్నారి జ్యోత్స్న(6)కు అండగా నిలుద్దామని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు విరాళాల సేకరణ చేపట్టారు. వెల్దుర్తి పాతబస్టాండ్ కూడలిలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సభ్యులు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురైన పావనిలత అవయవదానం ద్వారా పలువురికి ప్రాణందానం చేసి చరిత్రలో నిలిచిందన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి

పత్తికొండ, ఫిబ్రవరి 20: మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్‌గౌడు, తాలుకా అధ్యక్షుడు షాలురంగడు మంగళవారం డిమాండ్ చేశారు. హౌసింగ్ బిల్లులపై వాస్తవాలు రాసినందుకు దాడికి ప్రయత్నించడమే కాకుండా, చంపుతామని వైసీపీ నాయకులు బెదిరించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఎమ్మెల్యే స్పందించి నిందితులపై చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముంచుకొచ్చిన

నీటి ముప్పు

- అడుగంటి పోతున్న భూగర్భజలాలు
- ఎండిపోయిన రెండువేల బావులు, మూడువేల బోర్లు



గోనెగండ్లలో అడుగంటిన బోరు

గోనెగండ్ల, ఫిబ్రవరి 20: ఈ ఏడాది వేసవి రాకముందే నీటి ముప్పు ముంచుకొచ్చింది. వర్షాలు పెద్దగా కురియక పోవడంతో ఎండ వేడిమికి అరకొరగా ఉన్న భూగర్భజలాలు అడుగంటాయి. బావులు, బోర్లు, చెరువులు, కుంటలు అడుగంటాయి. వీటి కింద సాగుచేసిన పంట పొలాలకు నీరందక ఎండుముఖం పట్టాయి.

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో దాదపు రెండువేల బావులు, మూడువేల బోర్లు అడుగంటి పోయాయి. ముందస్తు ఎండలు రావ డం, సకాలంలో పెద్దవర్షాలు కురియక పోవడం కారణంగా బోర్లు ఎండిపోతున్నాయి.గోనెగండ్ల, కులుమాల, ఎర్రబాడు, అలువాల, అగ్రహారం, గంజహళ్లి, బైలుప్పల, పెద్దమరివీడు, చిన్నమరివీడు, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు హెచ్ కైరవాడి, పిల్లిగుండ్ల గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో బోర్లు, బావులు అడుగంటి పోతున్నాయి. బోర్లకింద సాగుచేసిన దాదాపు పదివేల ఎకరాల పంట నీరందక నీరసించడంతో రైతులు తల్లడిల్లుతున్నారు.

నాలుగుబోర్లు ఎండిపోయాయి

నాలుగు ఎకరాల్లో వేసిన నాలుగు బోర్లు ఎండిపోయాయి. వర్షాకాలం బోర్లలో నీరు బాగానే ఉంది. ఎమైందో ఎమో గానీ ఎండలు మండిపోయేకొద్ది బోర్లలో నీరు అడుగంటి పోతోంది. సాగు చేసిన పంటలు ఎండి పోతున్నాయి. **- జయరాముడు, పిల్లిగుండ్ల**

పంటలు ఎండిపోతున్నాయి

బోర్ల కింద చెవలకాయి. కొర్ర, మొక్కజొన్న పంటలు సాగు చేశా. బోరు, బావుల్లో నీరు అడుగంటి పోయింది. సాగు చేసిన పంటలు చేతికి అందే సమయంలో నీరు లేక పోవడంతో ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి చేతికి అందేలే కనిపించడం లేదు. **- కబుల్, రైతు, గోనెగండ్ల**

ఎస్ఎస్ ట్యాంక్‌లను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



గోనెగండ్ల ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 20: మండల పరధిలోని గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌లను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు శివకుమార్, సాంబయ్య పరిశీలించారు. ట్యాంక్‌లో నీరు ఎంత ఉంది, వచ్చే వేసవిలో ఈ నీరు సరిపోతుందా, ఎన్ని మోటర్‌లు ఉన్నాయి, విద్యుత్ కనెక్షన్ ఎలా ఉంది, సక్రమంగా నీటి పథకాలకు విద్యుత్ సరఫరా అవుతుందా లేదా అని పరిశీలించారు. క్లోరినేషన్ గ్యాస్ ఉన్నాదా లేదాని అలాగే రికార్డులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి మట్లాడుతూ గోనెగండ్ల, అలువాల గ్రామాలలో ఉన్న ట్యాంక్‌లను పరిశీలించామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇతర సమస్యలు ఏమైనా తమ దృష్టికి తేవాలని సూచించారు. వారి వెంట ఎస్ఎస్ ట్యాంక్ కాంట్రాక్టర్ మురళినాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్ : మాజీ ఎమ్మెల్యే బీవీ

- దళిత వాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ప్రచారం



నాయకుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న జయనాగేశ్వరరెడ్డి

నందవరం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో దళితులకు అందే సంక్షేమ పథకాలను కట్ చేసి దళిత ద్రోహిగా సీఎం జగన్ నిలిచారని టీడీపీ రాష్ట ఉపాధ్యాక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం నందవరం టీడీపీ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి రామారావు, మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం దళిత కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి జగన్ ప్రభుత్వ మోసాల గురించి వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీవీ అన్నారు. దళిత కాలనీలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రజలు ఆయూరారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పరిశ్రమలు లేక, యువత నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ పాలన అరాచక రాజకీయం చేస్తోందన్నారు. నిజాన్ని నిర్భయంగా తెలియజేసే విలేకరులపై దాడులు చేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని నష్టాల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు జగన్‌ను ప్రజలు చీదరించుకుంటు న్నారని, వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాదవరావు, మండల పార్టీ కన్వీనర్ డివి రాముడు, గురురాజారావు, కాశీంవలీ, నాగరాజుగౌడు, దర్మాపురం గోపాల్, మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు, మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి, పెద్దరాముడు, లచ్చప్ప, మస్తాన్, బ్రహ్మానందరెడ్డి, విశ్వనాథ్, గజేంద్రరెడ్డి, నందవరం షరీఫ్, ప్రకాష్, బతకన్న, నరసింహులు, తెలుగు ఈరన్న, వెంకటేశులు, శ్రీనివాసులు, వీరేష్, ఆదిశేషు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపేందుకు జనం సిద్ధం : కేఈ శ్యాంబాబు



గిరిగిట్లలో ప్రచారం నిర్వహిస్తున్న కేఈ శ్యాంబాబు, టీడీపీ నాయకులు

తుగ్గలి, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో అమలవుతున్న అరాచకపాలన చూసి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని గిరిగిట్ల, అమీనాబాదు గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం బటన్ నొక్కుతూ రాష్ట్రాన్ని అదఃపాతాలానికి తొక్కేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, తిమ్మయ్య చౌదరి, మనోహర్ చౌదరి, మధుబాబు, లింగమయ్య, మల్లికార్జున, తిరుపాల్ నాయుడు, సత్యప్రకాష్, వెంకటరెడ్డి ఉన్నారు.

ఫొటోగ్రాఫర్‌పైదాడి అమానుషం

పత్తికొండ : రాప్తాడులో జరిగిన సిద్ధం బహిరంగసభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ క్రిష్ణపై వైసీపీ వర్గానికి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడడం అమానుషమని, దాడికి ముఖ్యమంత్రి జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదుచేయించాలని డిమాండ్ చేశారు.

భారత్ గోధుమ పిండికి డిమాండ్

- వినియోగదారులకు అందుబాటులో లేని బియ్యం



కేంద్ర ప్రభుత్వం అందించే భారత్ గోధమపిండి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: నిత్యవసర సరుకుల ధరలు భగ్గుమంటుండడంతో కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరకే బియ్యం, గోధుమపిండి, శనగపప్పు అందిస్తోంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు నాఫెడ్ ద్వారా వినియోగదారులకు భారత్ గోధుమ పిండి, భారత్ శనగపప్పును ఆదోని వ్యవసాయ మార్కెట్లోని కేడీసీఎంఎస్ గోడౌన్ వద్ద అందిస్తుండటంతో బారులు తీరుతున్నారు. ఐదు కేజీల భారత్ గోధుమ పిండి రూ.138 ఇస్తున్నారు. ప్రస్తుతం గోధుమపిండి, శనగ బ్యాళ్ల మాత్రమే అందుబాటులో ఉన్నాయని మేనేజర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. తక్కువ ధరకే నాణ్యమైన గోధుమ, శనగలు వస్తుండడంతో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రోజు వందల మంది తీసుకెళ్తున్నారన్నారు. ఒక్కో వినియోగదారుడికీ ఐదు కేజీలు గోధుమ పిండి, అరకేజీ శనగ అందిస్తున్నామన్నారు. మార్కెట్లో బియ్యం ధరలు క్వింటాలు రూ.7 వేలు పైగా పలుకుతు న్నాయి. ప్రభుత్వం అందించే బియ్యం కోసం చాలామంది ఎదురు చూస్తున్నారు. భారత్ రైస్ ఇంకా ఆదోనికి రాలేదని, మరో 10 రోజులు పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. బియ్యం కూడా త్వరగా అందుబాటులో తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.

29న ఆదోనిలో మైనార్టీల మహా గర్జన



మాట్లాడుతున్న డాక్టర్ షేక్ మహబూబ్ బాషా

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: ఈ నెల 29న ఆదోని పట్టణంలోని మసూదియా ఉర్దూ పాఠశాల ఆవరణలో సాయంత్రం ఐదు గంటలకు ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం మహాగర్జనను నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎఫ్ (మైనారిటీ రైట్ ప్రొటెక్షన్ ఫోరం) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం మసూదియా పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. విద్య, వైద్యపరంగా ముస్లింలు అట్టడుగులో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తులు రాష్ట్రంలో 70 వేల ఎకరాలు జిల్లాలో 30 వేల ఎకరాలు అన్యక్రాంతం అయ్యాయన్నారు. భూ ఆక్రమణదారుల కబంధ హస్తాలలో ఆస్తులు ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మైనార్టీలు భారీగా తరలివచ్చి మహాగర్జన విజయవంతం చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ రోషన్, పారిశ్రామికవేత్త టీడీపీ నాయకుడు ఉమ్మి సలీం పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడి అమానుషం

పెద్దకడబూరు, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో సీఎం ఫోటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడిచేయటం అమానుషమని టీడీపీ తెలుగు రైతు అధికారప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాక్షాత్తు రాష్ట్ర సీఎం జగన్ పాల్గొన్న సభలో తమ పార్టీ కార్యకర్తలకు, గుండాలకు చేతులు మడచాల్సిన సమయం ఆసన్నమైందని, కత్తులు చేపట్టే సమయం ఆసన్నమైందని రెచ్చగొట్టేలే మాట్లాడటంతోనే వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి ఫొటో గ్రాఫర్‌పై దాడిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పూర్తి బాధ్యత సీఎం జగన్‌దేనన్నారు. దీనికి కారుకులైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

22న అష్టమ వార్షికోత్సవ జాతర

కోసిగి, ఫిబ్రవరి 20: కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో వెలసిన సద్గురు అరుఢ జ్యోతి శాంతాశ్రమంలో ఈ నెల 22న అష్టమ వార్షికోత్సవ జాతర ప్రారంభం కానున్నదని సిద్దారుఢ అలయ కమిటి పెద్దలు తెలిపారు. సద్గురు మధభినవ శివపుత్ర మహాస్వాముల వారి 68వ జయంతోత్సవం, జ్ఞాన దాసోహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూడు గడ్డివాముల దగ్ధం

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 20: హెచ్. మురవణిలో మూడు గడ్డి వాములు దగ్ధం కావడంతో రూ లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల మేరకు.. గుంటేప్ప, చిన్న హనుమంతుకు చెందిన గడ్డివాముల నుంచి ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అంతలోపే అ గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల పక్కకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బందిని అదుపులోకి తెచ్చారు. సంఘటన స్థలానికి వీఆర్వ్ విక్రమ్ చేరుకొని వివరాల సేకరించారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం



ఆలూరులో ఎల్లార్తి మల్లికార్జున ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆలూరు, ఫిబ్రవరి 20: రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని టీడీపీ నాయకులు ఎల్లార్తి బోయ మల్లికార్జున అన్నారు. మంగళవారం ఆలూరు పట్టణంలో చంద్రబాబు గెలుపుకోసం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి, మీడియాతో మాట్లాడారు. బీసీలు అధికంగా ఉన్న ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ టికెట్ బోయ సామాజికవర్గానికి ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయుడుకు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడును కలిసి విన్నవించానని పేర్కొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదలీలు చేపట్టాలని యూటీఎఫ్ పట్టణ గౌరవ అధ్యక్షుడు సునీల్ రాజ్‌కుమార్ అన్నారు. ప్రాంతీయ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలలో, పదోన్నతులలో ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులను అన్యాయం చేస్తోందని విమర్శించారు. నాయకులు మల్లికార్జున, జగన్మోహన్, ఋషికేశవ్, చక్రపాణి, నాగేష్, విష్ణువర్ధన్, ఇమ్రాన్; సాదిక్ హుసేన్, సుదాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బలం : విరుపాక్షి



వలంటీర్లను సన్మానిస్తున్న విరుపాక్షి

చిప్పగిరి, ఫిబ్రవరి 20: సంక్షేమ పథకాలే వైసీపీకి బలమని విరుపాక్షి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీశక్తి భవనంలో మంగళవారం జరిగిన వలంటీర్లకు సేవారత్న బహుమతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సేవారత్న-5, సేవామిత్ర-142 అవార్డులను వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జూటూరు మారయ్య, ఎంపీడీవో బారాన్ సాహెబ్, ఇన్‌చార్జి ఈవో ఆడి బాలన్న, వైసీపీ నాయకులు లింగన్న, షేక్షావలి, బుసినే వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా భీష్మఏకాదశి వేడుకలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 20 : పట్టణంలో భీష్మఏకాదశి వేడుకలను బెస్త కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామ వీధుల గుండా చెక్కభజనలు చేసుకుంటూ ఊరేగింపుచేపట్టారు. మధ్యాహ్నం గంగమ్మదేవి ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, బాలాజీ, మద్దిలేటి, తిరుమల్, వెంకటేష్, నాగమధు, మురళి, శ్రీనివాసులు, మహేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: స్థానిక గంగాభవాని దేవాలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి పూజా కార్యక్రమాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలను చేపట్టారు. గంగా భవాన్ని దేవాలయం ప్రధాన అర్చకుడు మధుసూదనరావు స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజలలో సంఘం పెద్దలు తెలు ఈరన్న, ఆటో వెంకటేష్, దుర్గయ్య, సోమప్ప, వీరేష్, మేఘనాథ్, బేల్దార్ శ్రీనివాస్, దీపక్ బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇంటింటికి ఉచితంగా నీరందిస్తాం : డీఈ

మద్దికెర, ఫిబ్రవరి 20: మద్దికెర గ్రామానికి మజారా గ్రామమైన బొజ్జనాయునిపేటలో ఇంటింటికీ ఉచితంగా కొళాయి నీరు అందిస్తామని పంచాయితీరాజ్ డీఈ శేషయ్య, జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. వేసవి కాలంలో ఏ గ్రామంలో కూడా నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పి.వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

విద్యార్థికి అభినందనలు

నందవరం, ఫిబ్రవరి 20: ముగతి మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి జి వీరేష్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సన్మానించారు. ఎడ్యుకేషన్ ఎఫిష ఎన్‌జీవో సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షల్లో నందవరం మోడల్ స్కూల్ విద్యార్థి వీరేష్ ప్రతిభ చాటి ఈఈఎంటి- 2024పరీక్షలో జిల్లాలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో 2023 నవంబర్ వరకు పట్టుబడిన అక్రమ మద్యాన్ని సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. వెంకటగిరి రోడ్డులో 24కేసుల్లో పట్టుబడిన రూ.3,88,384లు విలువ చేసే 844లీటర్ల మద్యాన్ని బొలేరో ట్రాలీ వాహనంతో ధ్వంసం చేశారు. సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతూ నాన్ డ్యూటి పేయిడ్ లిక్కర్ కావడంతో ఇతరులకు అమ్మే అవకాశం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలతో ధ్వంసం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ భార్గవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి : తుంగభద్ర నది సమీపంలోని అగసనూరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు పట్టుకున్నారు. టీవీఎస్ స్టార్ సిటీ వాహనంపై 5 బాక్సుల్లో 480 బిగ్‌సాఫ్ ఒరిజినల్‌చాయిస్ డీలక్స్‌ను స్వాధీనం చేసుకొని డి.బెళగల్ గ్రామానికి చెందిన బసాపురం హనుమంతరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

మంత్రాలయం: దైవందిన్నే గ్రామానికి చెందిన ఎరుకల వెంకటేశ్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి ఒక బాక్సులో తెస్తున్న 96 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని వెంకటేశ్‌ను అరెస్టుచేసినట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

శ్రీమఠంలో భక్తులకు నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, ఫిబ్రవరి 20. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు సప్త ముద్రధారణ చేశారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రత్యేక పూజలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 20: వచ్చే ఎన్నికలలో విజయఢంకా మోగించి చంద్రబాబు సీఎం కావాలని కాంక్షిస్తూ టీడీపీ నాయకులు చింతాలముని నల్లారెడ్డి స్వామికి 101 టెంకాయలు సమర్పించారు. అలాగే ఎమ్మిగనూరు నియోజక వర్గం నుంచి బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి టీడీపీ టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలవాలని తెలుగుయువత నాయకులు తిరుపతయ్య, బేతాలబడేసా, రామాంజినేయులు పూజలు చేశారు.